క్లుప్తంగా

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న భాస్కర్‌నాయక్

అక్కన్నపేట(హుస్నాబాద్‌): మండలంలోని పెద్దతండా గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గ్రామస్తుడు గుగులోతు భాస్కర్‌నాయక్ వినతి పత్రం అందజేశారు. అలాగే మల్లంపల్లి గ్రామం నుంచి తాళ్లతండా మీదుగా కట్కూర్ వరకు బీటీ రోడ్డు నిర్మించాలని, అందుకు నిధులను మంజూరు చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు.

హుస్నాబాద్‌రూరల్‌: హుస్నాబాద్ మండలం మీర్జాపూర్, భల్లునాయక్ తండా వరకు ఆర్టీసీ బస్సు సర్వీసు నడపాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు వేల్పుల సంపత్ ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు విన్నవించారు. బస్సులో ప్రయాణించేందుకు 4 కి.మీల దూరం నడువాల్సి వస్తుందని, తండా వరకు బస్సు నడపాలని కోరారు. మంత్రి స్పందించి తండా వరకు బస్సు నడిపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సంపత్ తెలిపారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

నర్సాపూర్‌: పట్టణంలోని కేతకి భ్రమరాంబ సమేత మరకత మల్లికార్జున స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు యాదవ సంఘం ఆధ్వర్యంలో రెండో రోజు ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా భక్తులు గంగకు వెళ్లడం, దేవునికి అభిషేకం తదితర పూజలు చేశారు. ఒగ్గు కళాకారులు ఒగ్గు కథ చెప్పారు.

న్యూ ఇయర్ సందడి

జోరుగా కేకులు, రంగుల విక్రయాలు



దుబ్బాకలో కేకలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

దుబ్బాక: హ్యాపీ న్యూ ఇయర్ అంటూ ప్రజలు కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. దుబ్బాకతో పాటు పలు గ్రామాల్లో చిన్నాపెద్ద నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. 2024కు ఘనంగా స్వాగతం పలకడానికి యువత పోటీ పడ్డారు. నియోజక వర్గ కేంద్రమైన దుబ్బాకలో బేకరీలు, రంగుల దుకాణాలు ఆదివారం కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి. మార్కెట్లోకి చోటా భీమ్, రాబిట్, పీకాక్, గిటార్, మిక్కీమౌస్ కేకులను ఆకర్షణయంగా తయారు చేశారు.

కేకులకు 'న్యూలుక్'

గజ్వేల్‌రూరల్‌: పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ న్యూ ఇయర్ వేడుకలను జరుపుకునేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధమయ్యారు. న్యూఇయర్ వేడుకల్లో అందరూ కేకు కట్ చేసేందుకు ఉత్సాహం చూపుతారు. పట్టణంలోని పలు బేకరీల్లో న్యూ ఇయర్ వేడుకల కోసం అందమైన కేకులను సిద్ధం చేశారు. కస్టమర్లను ఆకట్టుకునేందుకునే బేకరీల నిర్వాహకులు ఆఫర్లు ప్రకటించారు. యువత కేకులు కొనుగోలు చేసేందుకు బారులు తీరారు.

రంగులమయం కానున్న వాకిళ్లు

న్యూ ఇయర్ వేడుకలు వినూత్నంగా జరుపుకునేందుకు ఆలోచనలు చేస్తారు. మహిళలు అందమైన ముగ్గులు వేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతారు. ఇందుకోసం మార్కెట్‌లో రంగు విక్రయ స్టాళ్లు వెలిశాయి. గతంలో న్యూ ఇయర్ వేడుకల శుభాకాంక్షలు గ్రీటింగ్ కార్డుల ద్వారా తెలిపారు. ఇప్పుడు వాట్సాప్ మెసేజ్ ద్వారా తెలియజేస్తున్నారు.

2న విద్యుత్ సరఫరా బంద్

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి సబ్‌స్టేషన్ పరిధిలోగల పలు గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ మధు తెలిపారు. మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు గమనించాలన్నారు.

మంత్రికి భూ నిర్వాసితుల వినతి



గుడాటిపల్లి ముంపు భూ నిర్వాసితులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అక్కన్నపేట(హుస్నాబాద్‌): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గుడాటిపల్లి భూ నిర్వాసితుల యువతులు, వివిధ వర్గాల నుంచి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతులు వెల్లువెత్తాయి. ఆదివారం హుస్నాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో మంత్రిని కలిసి తమ గోడు చెప్పుకున్నారు. అయిత గత బీఆర్ఎస్ పాలనలో రెండు నెలలు గుడాటిపల్లి గ్రామవద్ద నిర్మిస్తున్న గౌరవెల్లి ప్రాజెక్టుకట్ట వద్ద భూ నిర్వాసితుల యువతులు దీక్షలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారు మంత్రిని కలిసి తమ గోడు విన్నవించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ గుర్తుందని, మాట ప్రకారం భూ నిర్వాసితుల యువతులను పరిహారం ఇచ్చి అందుకుంటామన్నారు. కానీ, ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేనందున కొంత సమయం పడుతుందన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ చేపడతాం

మండలంలోని నందారం స్టేజీ వద్ద పునరావాస కాలనీ, బంగారులొద్ది తండావాసులు, పలువురు గిరిజనులు మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. సేవాలాల్ మహారాజ్ తండా గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండలంలో కొత్త ఏర్పాటు కానున్న గ్రామపంచాయతీల విషయంలో ప్రజల ప్రజాభిప్రాయ సేకరణ చేపడతామన్నారు. అనవసరంగా ఎవరూ ఆందోళన చెందవల్సిన అవసరం లేదన్నారు. 15 రోజుల్లో అధికారులు తండాల్లోనే ప్రజాభిప్రాయ సేకరణ చేస్తారని, ఆందోళన, రాస్తారోకోలు చేయొద్దన్నారు.

నూతన సంవత్సర చిత్రం ఆవిష్కరణ



రుస్తుం ఆవిష్కరించిన చిత్రం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 2024 నూతన ఆంగ్ల సంవత్సర చిత్రాన్ని ప్రముఖ చిత్రకారుడు రుస్తుం ఆదివారం సిద్దిపేట పట్టణంలోని రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గత సంవత్సరం జ్ఞాపకాలను మననం చేసుకుంటూ, నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుదామన్నారు. కార్యక్రమంలో జులేఖరుస్తుం, అసిస్టెంట్ ప్రొఫెసర్ రూబీనారుస్తుం, మహ్మద్ సాధిక్, నహీం రుస్తుం, ఎండి రహీం తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ ఆలయం ముస్తాబు



దుబ్బాకటౌన్‌: నూతన సంవత్సరంలో అంతా మంచి జరగాలని ప్రజలు దేవాలయాలకు వెళ్లి తమ ఇష్ట దేవులను దర్శనం చేసుకుంటారు. తెలంగాణ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన దుబ్బాక పట్టణంలోని బాలాజీ ఆలయానికి భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఆలయ కమిటీ దర్శన ఏర్పాట్లు చేసింది. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు

మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్త



అల్లీనగర్‌లో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ గుప్త

ములుగు(గజ్వేల్): కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ఆరు గ్యారంటీల పథకాలను అందజేస్తుందని ములుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్త అన్నారు. మండలంలోని అల్లీనగర్ గ్రామంలో ఆదివారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థిక స్థితిగతులు, జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ కర్తవ్యమన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రకటించిన విధంగా అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రెండు గ్యారంటీలను అమలు చేసి తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని నిరూపించామన్నారు. అభయ హస్తం ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి పారదర్శకంగా దరఖాస్తుల స్వీకరణ చేపడుతున్నట్లు చెప్పారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరూ ఆరు గ్యారంటీలు పొందడానికి దరఖాస్తు చేసుకోవచ్చని, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి రాజకీయ వివక్షతకు తావులేదన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు రాములుగౌడ్, ఉపాధ్యక్షుడు రవి, ఉపసర్పంచ్ కొమురయ్య, నాయకులు భూపాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రాజుయాదవ్, నర్సింహులు, మల్లేష్‌యాదవ్, నయామొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలను కించపరుస్తున్నారు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సిద్దప్ప

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని సీపీఎం, బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వేర్వేరుగా మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లన్న జాతర కోసం ఆలయంలో ఏర్పాటు చేయాల్సిన సమీక్షా సమావేశం ఓ ప్రైవేటు హోటల్లో ఏర్పాటు చేయడం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అధికారిక కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను కాదని ఓడిన వారితో ఎలా చర్చిస్తారని మండిపడ్డారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడిగా కృష్ణారెడ్డి, దాసరి ప్రశాంత్, ఇస్తారి, మల్లేశం, జెడ్పీటీసీ సిద్దప్ప, వైస్ఎంపీపీ కాయిత రాజేందర్ రెడ్డి, తలారి కిషన్, ముత్యం నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ ఉపాధ్యాయుడికి సన్మానం



యామరాజును సన్మానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌రూరల్‌: అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు యామరాజు తెలంగాణ ఉద్యమంలో నల్లబ్యాడ్జి ధరించి ప్రత్యేక రాష్ట్రం వచ్చే వరకు నిరసన తెలిపాడు. తెలంగాణ రాష్ట్ర చిహ్నాలను రూపొందించాడు. గత ప్రభుత్వం విస్మరించినా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆదివారం ఆయనను అభినందించారు. యామరాజు సేవల గురించి సీఎం రేవంత్‌రెడ్డికి వివరిస్తానన్నారు.

ఆసుపత్రి అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి



భాగ్యలక్ష్మిని అభినందిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్‌: దుబ్బాక ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రి అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆసుపత్రిలో రోగులు కూర్చునేందుకు దుబ్బాక మున్సిపల్ బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు దాత్రిక భాగ్యలక్ష్మి 30 కుర్చీలు ఆదివారం బహూకరించారు. ఎమ్మెల్యే ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. ఆసుపత్రి దేవాలయంతో సమానమన్నారు. పేద రోగులకు వైద్యసేవలు అందించే ఆసుపత్రిని అభివృద్ధి చేసుకుందామన్నారు. దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత, ఎంపీపీ కొత్త పుష్పలత, జెడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడికి సామూహిక మధురాభిషేకాలు



శ్రీ కృష్ణ భగవానుడికి మధురాభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలో శ్రీ కృష్ణ భగవానుడికి ఆదివారం భక్తులు 116 కిలోల చక్కరతో మధురాభిషేకాలు నిర్వహించారు. గీతా పారాయణంలో భాగంగా ఆదివారం తొమ్మిదో అధ్యాయంలో రాజవిద్య రాజ గుహ్యామోగ పారాయణం పూర్తి చేశారు. దీంతో స్వామి వారికి మధురాభిషేకాలతో పాటు మహిళలు మంగళ హారతులతో సామూహిక పూజలు చేశారు. ఈ సందర్భంగా వైదిక నిర్వాహకుడు రాజపున్నయ్య శర్మ మాట్లాడుతూ 18 రోజుల పాటు భగవద్గీత 18 అధ్యాయాల సామూహిక పారాయణం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వైదిక, పారాయణ నిర్వాహకులు విఠాల రమేష్ శర్మ, ఇరుకుల్ల లక్ష్మయ్య, నేరండ్ల బాలకిషన్, రామచంద్రం, విశ్వనాథం, రఘు, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూవాహిని పట్టణ సంయోజక్‌గా లక్ష్మణ్ ప్రసాద్



హిందూవాహిని నూతన పట్టణ కార్యవర్గ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట పట్టణ హిందూవాహిని సంయోజక్‌గా లక్ష్మణ్ ప్రసాద్, నాసరపుర బస్తి సంయోజక్‌గా భార్గవ్, సహ సంయోజక్‌గా హేమంత్, మధు, సదస్సులుగా లోకేష్, శ్రీనివాస్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు బస్వరాజు సత్యం నియామక పత్రాలను ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సాంప్రదాయాలు, సంస్కృతిని కాపాడడానికి హిందూ వాహిని కార్యకర్తలు సమాజాన్ని చైతన్య పరుస్తూ ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో హిందూ వాహిని జిల్లా సహ సంయోజక్ బండి కిరణ్ కుమార్, జిల్లా అడ్వకేట్ ప్రముఖ్ ప్రదీప్, జిల్లా నిధి ప్రముఖ్ పర్శరాం పాల్గొన్నారు.